# వెంకటస్వామి పాలెం

ఎవురో యీపొమీన పెటీమని సరిచినట్టు వులిక్కిపడి గబిక్కిన లెగిసి కూకుండాడు వెంకటస్వామి.

ఇంకా సెన్నపట్టంనుండి కలకత్తాకిబోయే తుర్మేలుబండి రాకతలికే—అంటే మామూలుగా తెల్లావుజామున జనమంతా లెగిసి పనిపాటలు సేసుకొనే యాల యింకా సానా సేపు వుందనంగానే ప్లీడరు అనుమంతయ్యగారి ఆఫీసుగది దర్వాజాకు పక్కన మూలగా పాపపీదముపసుకు పడుకునుండ అనుమంతయ్యగారింటి పసిపిల్లకాయ ఎంకటస్వామి మామూలుయాలకు ఎతిరేకంగా తెల్లారి మూడుగెంటల యాలప్పుడు ఉండట్టుండి ఆవజాన ఎగ్గిరిపడి లెగిసి కూకుండాడంటే పైనుంచి ఏదయినా బలిపిల్ల గిల్లిపిల్లమీనకు దూకయినావుండాల, కాదుగూడంటే ఎలికెపిల్ల బొలికెపిల్లయినా గబిక్కిన గీకి ఎటుగానో లగెత్తుకు పోయన్నా పోయుండాల! అయితే ఆవజాన ఎగ్గిరిపడి లెగిసి బిత్తరసూపులు సూత్తుడం ఎంకటస్వామి ఎసువంటి బల్లి పిల్ల ఎలికపిల్ల జోలికిబోక లెగిసినోడు లెగిసినట్టే గోడకు ఆవజానే కరుసుకుని నిటారుగా కూకుండిపొయ్యాడు.

ఎంకటస్వామి కలగన్నాడు నిదర్లో కలగన్నోళ్ళు నిదర్లెగిసినాక ఆ కల ఏలా యిశేషాన్నిబట్టి ఎటువంటి సూపులు సూత్తా కూకున్నా కూకుండొచ్చు. ఎంకటస్వామి యింకా బిత్తరసూపులుసూత్తా గోడకు నిటారుగా కూకునుండాడు.

ఆవజాన లెగిసీ లెగవంగానే ముంగల తను కలగన్నా ననుకోలా ఎంకటస్వామి. కాని అనుమంతయ్యగారి యింటి జనం యాడపండుకున్నోరు ఆడే సలీసప్పుడు కాకుండా పండుకునుండేతలికి యిగ తను కలగన్నది కాయమనుకున్నాడు ఎంకటస్వామి.

ఇట్టా కోర్టుకెల్లిన అనుమంతయ్యగారు గబగబ బూడూసులు టకటకటక కొట్టుకుంటా వొచ్చి ఆఫీసు దర్వాజా తలుపు గబాల్నదెరిసి మూలపండుకునుండ తన తలకాడ నిలబడి వొంగి తనకల్లి గురిగా సూస్తుండట్టు ఎంత గెట్టిగా నయినా కలగన్నాడు ఎంకటస్వామి.

అనుమంతయ్యగారేందో, తనకల్లి అట్ట సూట్టమేందో, తనాపోజాన ఎగ్గిరిబడి ఎందుకు లెగిశాడో అరదంకాక కొత్తె తికమకబడ్డాడు ఎంకటస్వామి.

ఇంకా యింటోయాడా ఎవురూ లెగవలేదు. యింటిపని సేసుకునేయాల

యింకా సానావుంది. అయినా యిగ నిదరబట్టలేదు ఎంకటస్వామికి. అగానే గోడకు ఆనుకూర్చుకుని ఆలోసెనలో పడ్డాడు ఎంకటస్వామి.

ఇంతకుముంగల తను ఎన్నో కలలు గన్నాడు ఎంకటస్వామి. తను పాలెంలో అయ్యా అమ్మోళ్ళను వొదిలేసి అనుమంతయ్యగారితో బస్తీకి మొట్టమొదటిసారిగా రావటం, బస్తీలో వెల టీదీపాలు, రంగురంగుల అద్దాల దుకాణాలు, గోడలమీద సినిమా పేపర్లు, వందలకొద్ది మడుసుల్లాగే రిక్సా బస్సు, ఎన్నెన్నో సుర్రుబుర్రు బళ్ళను తను కలగన్నాడు. ఆమీన తన కెందుకో బస్తీమీన కలలు రావడం తగ్గినై. యీడకి వచ్చిన కొన్నాళ్ళకే తనకి బస్తీమీన మోజు తగ్గుతావొచ్చింది. యింకోనాడు అయ్యా అమ్మల్తో తనూ రంగన్నా, రామన్నా, సీతక్కా, బూసాం, సుబ్బాం కలిసి వనకోతలకిబోయి ఆడ బూసాం, సుబ్బాం, గెనుముంటెంట పిల్లిమిసరకాయలు కోసుకు తింటుండట్టు కలగన్నాడు తను. యింకోపాలి పాలెంలో శివుడిగుడి ముంగల ఎన్నెట్లో తను కోటాయి ముటాత్తో గలిసి బలిగుడు ఆడ్తుంటే మాలచ్చి సప్పట్లు సరుస్తా ఎగుర్తుండట్టు కలగన్నాడు.

అయితే యియ్యాళ తనుగన్న కలకీ, ఎనకటి కలలకీ ఎటుగా సూసినా సంబంధంలేదు. కలలో అనుమంతయ్యగారు ముక్కూ, ముక్కద్దాలాడిస్తా ఆవజాన సూత్తావుండటం ఒకిదంగా ఎంకటస్వామికి కడుపులో తొలిసినట్టయింది.

ఇయ్యాల కలలో పరిచ్చగా సూసినంతగా అనుమంతయ్యగార్ని యింతకి ముంగల సూడలా ఎంకటస్వామి. ఎందుకో అనుమంతయ్యగారు తనవేపు అట్టా సూత్తుంటాడు ? యీమద్దె అనుమంతయ్యగారు తనవేపు యీవజాన రెండు మూడుసార్లు సూసినటు ఎంకటస్వామికి మసగమసగ్గా అనుపించింది.

ఓపాలి తను అనుమంతయ్యగారి బూడ్సులు అంతకు ముంగలే పాలీసు చేసి దరవాజాపక్కనబెట్టి, దొడ్లోకెళ్ళి నీలబాయిలేరుకు సిప్పు తగిలించి, సిమింటి తొట్లోకి బాయిలోంచి మప్పయి కడవల నీలులాగి, నీలతూములుకాడ గబ్బు కొడుంటే పినాయిలుబోసి కడిగి, సెట్లపాదులకాడ సెత్త సెదారం ఎత్తేసి, మచ్చుమీన కట్టెలుదింపి కీళ్ళాలిసి, సీలగసలో జిడ్డుగావుంటే గొబ్బరిపీసుతో రుద్ది, మెట్లగెదికాడ పినాయిలు డబ్బా పెట్టడానికి దర్వాజా మలపు యిట్టదిరుగుతా గబిక్కిన పాలీసుచేసిన బూడ్సులమీన సూడక తడికాలువేసి తొక్కాడు తను. నల్లగా నిగనిగమంటుండ బూడ్సులమీన తడికాలు పడేసరికీ ఆ బూడ్సులు ఎట్టయిపోయిందీ సూసి బిత్తరబోయి తను యిట్లా పక్కకి తిరిగిసూత్తే – దర్వాజా పక్కనే నిలబడి తనవేపు ముక్కూ, ముక్కద్దాలాడిస్తా యింతగా

సూస్తుండాడు అనుమంతయ్యగారు.

ఇంకోపాలి తను పడగ్గదులు. బోజనాలగది, ముట్టగది, మెట్లగది కడుగుతా, గుడ్డతో నీలపిండి పారబోస్తా ఆఫీసు గదిలోకొచ్చి కురిజీలు వరండాలో పెడ్తా మేజాకాడి కొచ్చేతలికి. అనుమంతయ్యగారి రెండో అబ్బాయి సుందరం బొమ్మల పుస్తకం అడ తెరిసిఉంది. అనుమంతయ్యగారబ్బాయిలు కనకం, సుందరం మేజాముంగల కురిజీల్లో కూకొని రోజూ అదేమయిన పుస్తకాలు సదువుకుంటా, ఆ బొమ్మలు ఈ బొమ్మలని నవ్వుకుంటా గిచ్చుకుంటావుంటే తనూ కాస్తెసూద్దామని అయ్యేందో సెప్పమని కనకం, సుందరాల్ని అడిగితే ముంగల కనకం ఎక్కిరిస్తే ఆనక సుందరం ఎక్కిరిచ్చాడు తనని. అటీటు సూసి తను సల్లగా ఆ బొమ్మల పుస్తకాన్ని తీసుకొని కాయితాలు తిప్పుతా రంగురంగుల రవిలుబండి, కోళ్ళు, కొండలు సూస్తా అటనే కురిజీలో కూచుని పొయ్యేతలికి, ఎవురో తన పక్కనొచ్చి నిలబడినట్టనిపించి, ఒట్టి తలెత్తిసూత్తే, అనుమంతయ్యగారు తనవేపు ఉయ్యాల కళ్ళలోకిమల్లె ఆ ముక్కద్దాల్లో ఆవజాన ఎటకారంగా చూత్తుండాడు.

నిద్దర్లో ఆవజాన కలగని లేసి కూకుంద ఎంకటస్వామికి యియన్ని గెపితికొచ్చేతలికి ఎనకాల యీపుమీన ఏందో వానపాముకుమల్లే సల్లగా ఎగబాకినట్టయింది.

ఆనాడు అనుమంతయ్యగారు తన పొలాల పనిమీన పాలెం రాటం గెపితి కొచ్చింది ఎంకటస్వామికి. అప్పుడు తను అయ్యపక్కనే వుండాడు. అయ్య అనుమంతయ్యగారికి దణ్ణాలు పెట్టాడు.

"ఏం వెంకయ్యా బాగున్నావా?" అని అయ్యని పలకరిచ్చాడు అనుమంతయ్యగారు ముక్కద్దాలు సద్దుకుంటా.

"అదేబాగులే దొరా – అట్టుండాం. మాకు పాపతి లేక పోయిందిగాని తమపొలమే చేసుకుంటా కనిపెట్టుకునుంటే మా రోజులు యింత మదనష్టకంగా వుండేయి కాదేమోనని లోనపీకుతా ఉంటది."

"సరే అయిపోయిందానికి యిప్పుడెందుకు వెంకయ్యా, పంట ఆయేడు కాయేడుకు ఎక్కువవుతోంటే యింకొంచెంస్తా కవులు ఎక్కువ యివ్వమంటే వరి నువ్వు యివ్వకబోతివి. సరే అయిపోయిందిగా," అన్నాడు అనుమంతయ్యగారు.

"పానీలేదొరా! అదేదో శనిపట్టింది గనకనే మేంసేసిన కష్టం యింకోరికి కవులు దక్కిందనుకుంటా. ఏనాడో మీ కడుపున పుడ్తా. ఇగోదొరా! యీ

బుడ్డోణ్ని కాత్తె మీ పంచన పడుండనిస్తా యింత కలో గంజో పోశారంటే పుట్టినన్నాళ్లూ మీకు రుణపడుంటా. కరువుదినాలు—పూట గడపకుండా వుంది దొరా-" అన్నాడు అయ్యా.

"అట్లాగే వెంకయ్యా! ఏదో ఆ పని యీ పని చేసిపెడ్తూ మాతో పాటే మీ వాడూ వుంటాడు" అన్నాడు అనుమంతయ్యగారు.

మరసనాడు రవిలు పేసనికి తను, అనుమంతయ్యగారు గుర్రబ్బండిమీన ఎల్తావుంటే బండికి ఎనకమాలే అయ్యా పొలిమేర్లదాకా లగెత్తుకుంటావొచ్చి "యిగ వుంటా దొరా" అంటా తనకళ్లి సెయ్యూవూపుతా ఆడే నిలబడిపొయ్యాడు.

"పాల్ పాల్" అంటా బజారు వాకిలికాడ గవిడిబర్రె పాలమడిసి కేక బెట్టాడు.

"వెంకటస్వామీ!" అనరిశాడు గదిలోంచి అనుమంతయ్యగారు. ఎగ్గిరి లెగుస్తా కలల మైకంలో పడ్డ వెంకటస్వామి తెల్లారొచ్చిం దనుకుండాడు.

* * *

ఆ రోజున కనకం, సుందరం బజార్నుంచి ఎగురకుంటా వొచ్చి వరండాలోవుండ రెండు నవారు మంచాల్ని గబగబ మోసుకెళ్లి ఎండలో పడేసి, దబదబ ఏందో యింతలావు పొట్లం యిప్పతుంటే, యీ యవారమంతా ఓకంట సూత్తుండ ఎంకటస్వామి "అదేంది అబ్బాయిగోరూ?" అనడిగాడు కనకం, సుందరాల దగ్గిరకెళ్లి నిలబడ్తా.

"మా నాన్న మాకు సీంటపాకాయలు, చిచ్చుబుడ్లు, ముత్యాల పువ్వొత్తులు, కాకర పువ్వొత్తులు మరే-ఎర్ర మతాబులు, పచ్చ మతాబులు, నక్షత్రం తీగెలు, విష్ణుచక్రాలు, విమానాలు—మరే — ఎర్రనిపెట్టెలు, పచ్చని పెట్టెలు, తాటాకు టపాకాయలు, యింకా పాము మందుకూడా కొనిపెట్టాడు! వీటన్నిట్నీ మేం ఎండబెట్టుకుని రాత్రికి కాల్చుకుంటాం" అంటా ఎగశాస దిగశాసల్తో పటపట మనిపిస్తా సెప్పేశాడు సుందరం.

"కాస్త దూరానుండొచ్చు—తమరికి యిక్కడేం తీసుకురాలా" అన్నాడు పెద్దబ్బాయి కనకం.

"నిన్నెప్పుడేం అడగలేదయ్యోవ్ మంగలగానే తొంటిసెయి బయటికి పెడ్తుండావుగాసి" అన్నాడు ఎంకటస్వామి జావగారిపోతా.

బద్రంగా పొట్లాం యిప్పదీసి ఆటన్నిట్నీ మంచాలమీన పడత్తుంటే ఆటి రంగులన్నీ మెరుస్తుండ ఎంకటస్వామి కళ్లల్లో గిరగిర ఒరిగినై.

సందేలలోపల వద్దెమద్దె ఎనిమిసార్లు ఎంకటస్వామి ఆ మంచాలకు అంతదూరంగా నిలబడిసూశాడు గాని ఆ ఎనిమిసార్లలో నాలుగుసార్లు కనకం, యింకో నాలుగుసార్లు సుందరం ఆ మంచాల సుట్టూతా తిరుగతానే వుండారు.

ఆవజాన కనకం, సుందరం ఆయన్నీ తెచ్చి ఎడలో ఆరబోసేదాకా దీపాలమాస దగ్గిరకొచ్చిందని తనకు తెలవదు గందా! అనుకుండాడు ఎంకటస్వామి బాయిలో సేదవేసినోడు అటనే నిలబడిపోతా.

సిచ్చుబుడ్లు మాలావుగుండాయి గాని, "ఎవరికి యిక్కడేం తీసుకురాలా" అన్నాడే కనకం - ఎటనబ్బా? అనుకుండాడు ఎంకటస్వామి బాయిల్లో నిప్పేస్తా.

పాలె లోనే గనక తను యిప్పుడు ఏంజేస్తా వుండేవోడు? పోయిన దీపాలమాశకు యింకా దీపాలమాశ పదిరోజులుండనంగానే మాసరాకి తను ఓ పూలగుమ్మటం గట్టి, వూరిమద్దె బజార్లో ఆ సివర్నించీ యీ సివరికి రయ్ రయ్ న దిప్పుతా లగెత్తటం గెపితికొచ్చేతలికి ఒక్కపాలి వొల్లు జలదరించి నట్టయింది ఎంకటస్వామికి.

కిందటేడు పది తాడిసెల్లెక్కి, ఆటి గులకసళ్ళన్నీ దంచి. కోటాయిని బతిమిలాడి, పున్నమ్మకొట్టో గంధకం, సూరెకారం తెచ్చి ఎన్ని పువొత్తులు కట్టాడు? యీడ అనుమంతయ్యగారి మేడగదులన్నీ గాలించినా ఒక్క తాడిసెట్టయినా అగుపియదు.

గదలన్నీ వూడ్సి, యిల్లంతా దిరిగి మేడమెట్లు పదిసార్లు ఎక్కి దిగొచ్చాడు ఎంకటస్వామి ఎందుకయిందీ తెలకుండా.

సీకటయినాక కనకం. సుందరం పువొత్తులు కాలుస్తుండే తంబాలచాటున నిలబడుండ ఎంకటస్వామి వడుసు లావజాన పువొత్తులు కాలుస్తుండే పాలెలో తను తంబాలచాటున వూరకనే సేతులు ఎనక్కిపెట్టుకని నిలబడు దేవోడు కాదనుకున్నాడు.

"నా మొహంలాగనే వున్నయి యీ పువొత్తులు. మరీ ఆ ఏటికాఏటికి యిట్టె పుటిక్కని ఆరిపోతూ రగనాసి పోతున్నయ్యాం ఖర్మ? వెంకటస్వామి ఏండ్రా - వాడికీ రెండేమన్నా యివండ్రా కాలుస్తాడూ?" అంది అనుమంతయ్య గారి పెల్లాం లచ్చిన్నరసమ్మగారు, సిన్నపిల్లని సంకలో ఏసుకుని సచ్చితాల తీగెలకా వస్తా.

"ఆఁ మాకో అమ్మా—" అంటున్నాడు కనకం.

"ఆఁ ఎవరు కాలుస్తే ఏం, యీ భాగ్యానికి చేతులు కాల్చుకోకుండా వుంటే అదే పండగ" అన్నారు అనుమంతయ్యగారు తాటాకు టపాకాయల గుత్తి బయటికిదీస్తా.

"చిచ్చుబుడ్డి ముట్టిస్తున్నావుటా సుందరం? వుండు వుండు-నీకు పుణ్యం వుంటుంది! అవి మొహాన చిమ్మితే కళ్ళు గాస్తా పోతయి. వెంకటసామి ముట్టిస్తాడు వుండు - వెంకటసామీ?" అని కేకవేసింది లచ్చిన్నరసమ్మగారు.

ఆ సిరేత్తిరి ఆఫీసుగది దరవాజా పక్కన సాంః మీన జవకాణా కప్పుకుని గోడకి నిటారుగా కూకునుండ ఎంకటస్వామికి వుండట్టుండి అనుమంతయ్యగారి మేడగోడలమద్దెన తనకి వూపిరిసలపటం లేదనిపిచ్చింది.

పాలెం ఒక్కసారి ఎంకటస్వామి కళ్ళలో మెదిలింది. పాలెం మడుసులే ఏరు! రెండెడ్లబండిమీన పాటలుపాడ్తా పొలంబొయ్యే బసవయ్యలాంటి ఎడుసులు యీడ అనుమంతయ్యగారి యింటిసాయల ఎంకటస్వామికి యింతమటుకు యాడా అగుపించలా. పాలెంలో సెరువులుండయి ఎప్పుడు యీతలీద్దామన్నా. ఆడ ఎన్నెలరేత్రిళ్ళలో శివుడిగుడిముంగల బలిగుడు ఆణ్ణాట ఇక పెపంచంలో యాడా ఆదరనాల్సిందే. రతం తిరనాలమటుకు రతం తిరనాల ఎట్టుంటది? పాలెంలో అయ్యతోబాటు పొలం పోవచ్చు. పొలంపని చేసుకువొస్తా గెనువులెంట పిల్లిమిసరకాయలు ఎన్నయినా కోసుకుతింటా యింటికొవచ్చు. కోటయ ముటా ఏంజేత్తుండారో? ఆళ్ళు తనని మరిసిపొయ్యారా? ఎన్ని పువొత్తులు గొట్టారో యీ ఏడు! ఆళ్ళతో శివుడిగుడిముంగల దీపాలఎల్తుర్లో ఎట్టవుండమంటే అట్టుంటది. అబ్బ!

"పాలెం ఎల్తానండీ" అన్నాడు ఎంకటస్వామి సేతులు నలుపుకుంటా అనుమంతయ్యగారితో మరసనాడే.

"ఆఁ?" అన్నాడు అనుమంతయ్యగారు ఎంకటస్వామిని యింతగా చూస్తా.

"వాడికి టపాకాయలు యివ్వలేదని కోపం నాన్నా," అన్నారు ఎంకటస్వామికి ఎనకమాలేవొచ్చి నిలబడ్డ కనకం, సుందరం.

"ఏడ్చాడు వాడిమొహం. అయినా అదేమిట్రా వెంకటస్వామీ? నిక్షేపంగా యిక్కడ జరుగుతుంటే ఎక్కడో ఆ పాలేనికి పోతానంటా వేమిట్రా చాదస్తం కాకపోతే! చాల్చాల్లే-ఈసారి వాడికీ రెండేమన్నా యివ్వ డీరా కాలుస్తాడూ- ఏమిటో చేతులు కాల్చుకుంటానికి" అన్నాడు అనుమంతయ్యగారు.

"మరి మాకో నాన్నా ?—" అంటున్నాడు కనకం.

"చాల్లేవోయ్! ఒకటో రెండో వాడికియిస్తే యింతలో తరిగిందేం లేదులే. ఎక్కడికిరా వెళ్ళేది వెంకటస్వామీ— చాల్చాల్లే ఎవరన్నా నవ్వుతారు-వూఁ. లక్షణంగా వెళ్ళి పనిచూసుకో- పండగరోజుల్లో యీ పన్లన్నీ ఏంగాను-వూఁ పోండి పోండి"-అంటూ పేపరు మొగానేసుకుండాడు అనుమంతయ్యగారు.

ఆనాడు సదేల వరండాలో నవారుమంచాల సందున తలొంచుకు కూకుని మణికట్టుతో ముక్కు తుడుసుకుంటుండ ఎంకటస్వామి ఏందో బూడతా సుల సప్పుడుకుమల్లే వుండదని యిట్ట తలెత్తిసూత్తే మంచమ్మినకి వొంగి ముక్కద్దాల్తో తన కల్లే ఎటకారంగా సూస్తుండాడు కల్లుబ్బుకుపోయే అనుమంతయ్యగారు.

అనుమంతయ్యగారు ఆవజాన కల్లుబ్బుకుపోయి పోకతాలికే ఎనికీ డ్తే మంచాల మయాన్నించి లెగిసి అటేటు సూడనన్నా సూడకుండా బజారువాకిలి బయటబడి, యిదిలిచ్చుకు లగెత్తిన లగెత్తటం, పాలెంలో శివుడిగుడి ముంగల మంటపం మయాన కోటయముటా పూలగుమ్మటాలు తిప్పుతా కేక లేత్తావుంటే యినిపిచ్చుకోకుండా గబగబ తంబంమీదనించి మంటపం శికరానికి ఎగబాకి, పాలెమంతా సిచ్చుబుడ్లు, అవాయసువాయిలు, శింటపాకులు, తాటాకు టపాకులు, ముత్తాలపువొత్తులు, కాకరపువొత్తులు, పెట్టదిమ్మెలు పగిలి పాలెమంతా ఎలిగి పోతావుంటం సూశాడు ఎంకటస్వామి.

★